
# మహానగరం కథలు

-వేదుల సుభద్ర





## మూసినవి తలుపులే...

*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

**తెలతెలవారుతూండగా** మెలకువ వచ్చింది శారదాఅగర్వాల్‌కి. దానికి కారణం ఆవిడ ఫోన్‌లో పెట్టుకున్న నెమలి కూత అలారం. ఆ ఫోన్‌ని చేతిలోకి తీసుకుని ఒకసారి చెవి దగ్గర పెట్టుకుని ఆ కూత మరొకసారి మురిపెంగా వింది.

"అయిందా మురిసిపోవడం? ఇంక దాన్ని ఆపేస్తే మిగతా వాళ్ళు నిద్ర పోతారు" పక్కనించి విసుగ్గా అన్నారు ఆవిడ భర్త శశాంక్ అగర్వాల్.

"ఇది వింటే మన ఊరిలో ఉన్నట్టే ఉంటుంది నాకు గెహనా అక్కా, అల్కా, అందరూ నాతో ఉన్నట్టే అనిపిస్తుంది. మనం వెనక్కి ఎందుకు వెళ్ళిపోకూడదు?" అందావిడ ఆశగా, జవాబు తెలిసినా సరే.

"అబ్బాయి ఆరునెలల్లో వచ్చేస్తాడు. ఈ లోపున కోడలి డెలివెరీ అయిపోతే అప్పుడు అవసరాన్ని బట్టి మనం ఉండేదీ, వెళ్ళేదీ నిర్ణయించుకోవచ్చు, దానికోసమే కదా మనం వచ్చింది ఈ లోపున ఊరికే కంగారుపడకు" అన్నాడు మళ్ళీ ఆయన నిద్రకుపక్రమిస్తూ.

"హు.. అమెరికా వెళ్ళినవాడు అంత తొందరగా వస్తాడా?అయినా అమ్మాయిని కూడా వాడితో తీసుకుని వెళ్ళాల్సింది కదా, ఇద్దరూ హాయిగా అక్కడే ఉండేవారు. ఈ పిల్లల ఉద్యోగాలేమిటో? ఇద్దరూ చెరొక చోటా ఉన్నా పరవాలేదనుకోవడమేమిటో? కవలపిల్లలని చెప్పింది డాక్టర్, తర్వాత కూడా మనం ఉంటే కాని ఒక్కర్తీ చేసుకోలేదు కదా, వాళ్ళ అమ్మే బ్రతికి ఉంటే పాపం వేరేగా ఉండేది." అంటూ ఇంకా ఏదో చెప్పబోతూ, అప్పటికే గురక పెడుతున్న ఆయనను చూసి దీర్ఘంగా నిట్టూర్చింది.

శశాంక్, శారదా అగర్వాల్ వాళ్ళది రాజస్థాన్‌లోని ఒక పల్లెటూరు. జైపూర్‌కి రెండు వందల కిలోమీటర్ల దూరం. ఊరిలో ఉన్న నాలుగైదు పెద్ద కుటుంబాలలో వాళ్ళదీ ఒకటి. చాలా సాంప్రదాయబద్ధమైన కుటుంబం, శశాంక్ అగర్వాల్, అతని అన్నా, తమ్ముడూ, వారి పిల్లలూ అందరూ కలిసి పెద్ద హవేలీలో ఉంటారు. మార్వాడీ కుటుంబాలకి చెందిన వారు మొదటినించీ వ్యాపారమే వృత్తిగా చేసుకున్నారు. శశాంక్ అగర్వాల్ అన్న సురేందర్ అగర్వాల్, తమ్ముడు ప్రమోద్ అగర్వాల్, ముగ్గురూ కలిసి వ్యాపారాలు చేస్తారు. ఆడవాళ్ళందరూ, పిల్లలనీ, ఇంటినీ, చూసుకుంటారు. ఎక్కడకి వెళ్ళినా కలిసే వెళతారు. తమ పండగలూ, పబ్బాలూ ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు.

శారదకి ఇద్దరు పిల్లలు, అబ్బాయి అంకిత్, అమ్మాయి అనీషా. అనీషాకి పంతొమ్మిదో సంవత్సరంలోనే పెళ్ళి చేశారు. ముగ్గురన్నదమ్ములకీ అంతా మగ పిల్లలే, కుటుంబానికంతా ఒక్కర్తే ఆడపిల్ల, కావడాన చాలా వైభవంగా చేసారు. పెద్దతని ముగ్గురు కొడుకులూ, మూడో అతని పెద్ద కొడుకూ కూడా వ్యాపారం చూసుకుంటారు. శారదా, శశాంక్‌ల కొడుకు అంకిత్ మాత్రం బిట్స్ పిలానీలో ఇంజనీరింగ్ చదివి ఉద్యోగం చెయ్యడానికి సుముఖత చూపించాడు. ఆ రకంగా అతను హైదరాబాద్‌లో ఉద్యోగంలో చేరాడు. అతని భార్య వర్ష, బొంబాయిలో పుట్టిపెరిగింది, అమ్మలేదు, ఒక అన్న, నాన్న తనూ. ఒక కాన్ఫరెన్స్‌లో కలిశారు ఇద్దరూ. ఇద్దరూ ఇష్టపడడంతో ఇంట్లో చెప్పి రెండేళ్ళక్రితం పెళ్ళి చేసుకున్నారు.

ఒక ప్రోజెక్ట్ పనిమీద అంకిత్ అమెరికా వెళ్ళే అవసరం వచ్చింది. ఆరునెలలకోసం. వర్ష గర్భవతి కావడం వల్లనూ, ఆమె ఆఫీస్‌లో పని వత్తిడి వల్లనూ వెంట వెళ్ళే అవకాశం లేకపోయింది. దానివల్లనే సరదాగా వారిద్దరితో సమయం గడుపుదామని రెండు నెలలక్రితం వచ్చిన శారదా, శశాంక్ లిద్దరూ అంకిత్ వచ్చేంతవరకూ అక్కడే ఉండిపోవలసిన పరిస్థితి ఏర్పడింది.

వెంటనే అన్నకి ఫోన్ చేసి మాట్లాడాడు శశాంక్ అగర్వాల్. వ్యాపారాలకి వచ్చిన ఇబ్బందేమీ లేదనీ, దగ్గరుండి కోడలిని జాగ్రత్తగా చూసుకోమనీ, 'ఘర్ కా చిరాగ్" ఉదయించినప్పుడు తామందరూ చూడడానికి వస్తామనీ ఆయన మరీ మరీ చెప్పాడు. శార్ద పెద్ద తోడికోడలు గెహనా ఆవిడతో మాట్లాడింది తర్వాత. తానూ అల్కా ఆమెని చాలా మిస్ అవుతున్నామని, వీలైనంత తొందరగా రమ్మని చెప్పింది. అసలే శారదకి బెంగగా ఉంది ఇంకా ఆరునెలలుండడమంటే.

"నువ్వు లేకపోతే హవేలీ అంతా బోసిగా ఉంది " అని గెహనా అనగానే ఏడుపొచ్చినంత పని అయింది ఆవిడకి.

"అవునక్కా, ఇక్కడ నాకు ఏమీ బాగాలేదు, అంకిత్ ఎల్లుండి రాత్రి వెళ్ళిపోతాడు, "బహు " ఒక్కతే ఉంటుందని ఉండాలి తప్ప ఇది మన ఊరా? మన భాషా? మన మనుషులా? ఏమిటో ఫ్లాట్లో తలుపులు వేసుకుని కూర్చుంటే ఒక్కోసారి ఊపిరి ఆడనట్టు ఉంటుంది " అని గొడవపెట్టింది.

వాళ్ళ హవేలీ చాలా పెద్దది, వెనక ఉన్న ఆంగన్ అనబడే పెద్ద వాకిట్లో తోడికోడళ్ళు ముగ్గురూ, వాళ్ళ కోడళ్ళూ, కూర్చుని అప్పడాలు, ఊరగాయలూ లాంటి పనులు చేసుకుంటారు. కబుర్లు చెప్పుకుంటారు, స్వెటర్లూ, శాలువాలూ అల్లుకుంటారు, బట్టలమీద అద్దాలూ, చంకీలు లాంటివి కుట్టుకుంటారు. పండగలప్పుడు అరచేతుల్లో అందంగా గోరింటాకులు దిద్దుకుంటారు. అవన్నీ అందరికీ ఎంతో ఇష్టం. అంతేకాదు వాకిళ్ళలోకి తరచుగా నెమళ్ళూ, కుందేళ్ళూ వస్తాయి. నెమళ్ళయితే రోజూ వస్తాయి. దాని కూత మరిది కొడుకు రికార్డ్ చేసి శారద కోరిక మీద ఆవిడ ఫోన్‌కి రింగ్ టోన్ లా పెట్టాడు హైదరాబాద్ వచ్చేటప్పుడు. అది వింటే ఆవిడకి తమ ఇంట్లో ఉన్నట్టు అనిపిస్తుంది. పన్నెండేళ్ళప్పుడు పెళ్ళయిందావిడకి, ఇప్పుడావిడ వయసు అరవై. చిన్నారి పెళ్ళికూతుళ్ళుగానే అత్తింట అడుగుపెట్టిన ముగ్గురు తోడికోడళ్ళూ సొంత అక్కచెల్లెళ్ళలాగే ఆడుకున్నారు, పాడుకున్నారు, కొట్టుకున్నారు, అసూయలూ, అపోహలూ పడ్డారు, వయసు తెచ్చిన పరిణతితో గొప్ప స్నేహితురాళ్ళయారు. అందుకే ముగ్గురికీ కూడా తమ సొంత అక్కచెల్లెళ్ళకంటే తోడికోడళ్ళంటేనే ప్రేమ, మమకారం. రోజుకొకసారయినా వారితో మాట్లాడితే కానీ తోచని అత్తగారిని చూస్తే వర్షకెంతో ఆశ్చర్యంగా ఉంటుంది.

వారు అద్దెకుంటున్న అపార్ట్‌మెంట్‌లో దాదాపు ఎనభై ఫ్లాట్ లుంటాయి. ముందర స్విమ్మింగ్ పూల్ ఉంది, పక్కనే షటిల్ బాడ్మింటన్ కోర్ట్. పక్కనే వేసి ఉన్న రెండు బెంచీలు. అక్కడ సాయంత్రం మగవారు కూర్చుని మాట్లాడుకుంటారు. దానికి ఎడంగా ఉన్నవైపున్న బెంచీల మీద ఆడవాళ్ళు. శారదకి తెలుగు రాకపోవడాన ఆవిడ కిందకి పెద్దగా వెళ్ళదు ఎప్పుడో ఒకసారి తప్ప. శశాంక్ అగర్వాల్ మాత్రం తరచుగా వెళ్ళి అక్కడ కూర్చుంటారు. శారద వంటలు చాలా అద్భుతంగా చేస్తుంది. ముఖ్యంగా రాజస్థానీ సంప్రదాయ వంటలైన "దాల్ బాటీ చూర్మా",మాల్పువా, పాపడ్ సబ్జీ లాంటివి మరీనూ. చాలా ఓపిక ఆవిడకి, కేకులు కూడా అద్భుతంగా చేస్తుంది. వినాయకచవితికి ప్రసాదంగా ఒకసారి "చూర్మా లడ్డూలూ, పూరీలు, కాలా చనా" చేసి రెండు పెద్ద డబ్బాలనిండా సర్ది పంపితే ఒక్కటి మిగిలితే ఒట్టు. అలా రాజస్థానీ ఆంటీ గా తెలిసింది ఆవిడ అందరికీ.

కోడలు పొద్దున్నే ఆఫీస్‌కి వెళ్ళిపోతే మళ్ళీ సాయంత్రం వస్తుంది. అప్పటివరకూ ఆవిడకేమీ తోచదు. పొద్దున్నే వంట చేసేస్తే ఇంకేమీ పని ఉండదు. పని మనిషి రాజేశ్వరి కొద్దిగా హిందీ మాట్లాడుతుంది, శారద హిందీ కూడా అంతంత మాత్రమే, ఇంట్లో వాళ్ళ మాతృభాషే మాట్లాడుకుంటారు. రాజేశ్వరి చాలా నమ్మకమైన మనిషి, పని కూడా చాలా బాగా చేస్తుంది.

"కిందింటి పద్మమ్మ కోడలికి కొడుకు పుట్టాడమ్మా" అంది రాజేశ్వరి ఒకనాడు గిన్నెలు కడుగుతూ.

"అలాగా, మరి మిఠాయిలివ్వలేదేం "అంది శారద.

"వాళ్ళకి బాగా తెలిసిన వాళ్ళకీ, చుట్టాలకీ ఇచ్చుకుంటారు, ఊరంతా పంచుతారేంటమ్మా, నువ్వు మరీనూ" అంది రాజేశ్వరి నవ్వుతూ.

" ఏమో, మా ఊరిలో అయితే మేము ఊరంతా పంచుతాం, అందులోను మగపిల్లాడు "అంది. ఆవిడకి వెంటనే గెహనా అక్కకి మొదటిసారి మనవడు పుట్టినప్పుడు తాము చేసుకున్న వేడుకలు గుర్తొచ్చాయి. అవే చెప్పింది రాజేశ్వరికి.

"నీకు తెలుసా, మా ఇంటికి మొదటి మనవడు వాడు. ఉదయ్‌రాజ్ అని పేరు పెట్టింది అక్కే, అచ్చు మా పెద్దవాడి పోలికే, ఎంత రాజాలా ఉన్నాడనుకున్నవ్? మేము పెద్ద పెద్ద బుట్టలనిండా పేడాలు, లడ్డూలూ తెప్పించి ఊరంతా పంచాం. ఉండు అప్పుడు కొనుక్కున లెహెంగా చూపిస్తాను "అని లోపలకెళ్ళి తెచ్చి చూపించింది.

"ముగ్గురిదీ ఒకేరకం, రంగులు తేడా అంతే. మొదటిసారి మనవడు పుడితే ఇంత నిశ్శబ్దంగా ఉండడం నేనెరగను "అంది. రాజేశ్వరి నవ్వింది.

"పట్నాల్లో అంతేలేమ్మా "అంది. ఆవిడ ఆ రోజు విషయాన్ని అల్కాతో చెప్పింది, "అక్కకు కూడా చెప్పు " అంటూ.

శారదకి డయాబెటీస్ ఉంది. అందుకని చాలా జాగ్రత్తగా ఉంటుంది. కోడలు కూడా మందులగురించీ, తీసుకోవలసిన జాగ్రత్తల గురించీ చెప్తూనే ఉంటుంది తరచూ. రోజూ కాసేపు ఆవిడ కారిడార్ లోనే నడుస్తుంది. అంతస్థుకు పది ఫ్లాట్‌ల చొప్పున ఎనిమిది అంతస్థులున్నాయి. ఒక చివరినించి మరొక చివరికి నడుస్తూ ఎప్పుడైన ఎవరైనా తలుపు తీసి ఉంచుతారేమోనని చూస్తుంది - ఆవిడ. కానీ సాధారణంగా ఎప్పుడూ అన్ని తలుపులూ వేసే ఉంటాయి. ఇద్దరూ ఆఫీసులకెళ్ళిపోయి తాళాలేసుకునే వారు కొందరయితే, ప్రైవసీ పేర తలుపులు మూసుకునేవారు కొందరు. అలా మూసుకుని ఉన్న తలుపులు ఎప్పుడు చూసినా ఆవిడ మనసు బాధగా మూలుగుతుంది. వారి హవేలీ తలుపు వెయ్యడమనేదే ఎరగరు, తాళం వెయ్యడమనేది కలలో మాట.

"గట్టిగా పిలిస్తే ఊరంతా కదిలి వస్తుంది అక్కడ, ఏ ఇంట్లో ఎవరుంటారో , అసలెవరైనా ఉంటారో లేదో కూడా తెలియని పరిస్థితి ఇక్కడ, ఇదేం నగరాలో, ఇవేం జీవితాలో అనుకుంటుంది" ఆవిడ నడుస్తూ.

కోడలు వర్ష పిన్ని వందన చెన్నైలో ఉంటుంది. వర్ష సీమంతం తన ఇంట్లో చేస్తాను, తర్వాత ఆమె తన మనవరాలిని చూసుకోవడానికి సింగపూర్ వెళ్ళిపోతుంది కనక రెండు రోజుల ముందే వర్షని తీసుకువెళ్తానని అనడంతో వర్ష పిన్ని దగ్గరకెళ్ళింది. కోడలి సీమంతానికి తామిద్దరికీ టిక్కట్లు బుక్ చేయించుకుని వస్తానని శశాంక్ అగర్వాల్ స్టేషనికి వెళ్ళారు. స్వయంగా స్టేషన్‌కి వెళ్ళి తనకి కావలసిన సీట్లు బుక్ చేయించుకోవడం ఆయనకి ఇష్టం, అలవాటు, అందుకే వర్ష ఆన్ లైన్ లో బుక్ చేస్తానన్నా కూడా ఇష్టపడరు.

పొద్దున్నే శారదని దగ్గరలో ఉన్న హాస్పటల్‌కి 'సుగర్' పరీక్షకి తీసుకెళ్ళి, ఆవిడని ఇంట్లో దింపి వెంటనే కోడలి స్కూటర్ మీద వెళ్ళారాయన. కొద్దిగా నీరసంగా అనిపించడంతో ఒక గ్లాస్ మజ్జిగ తాగి హాల్లో ఫాన్ వేసుకుని టీ.వీ చూస్తూ కూర్చుంది శారద. రాజేశ్వరి వంటింట్లో గిన్నెలు తోముతోంది. భర్త వెళ్ళి రెండుగంటలు దాటింది, ఇంకా రాలేదు, రష్‌గా ఉందేమో అనుకుందావిడ. ఫోన్ తీసుకెళ్ళే అలవాటు లేదు అతనికి. ఇంట్లో ఉన్నంతసేపు ఫోన్ జేబులో పెట్టుకుని తిరగడమూ, బయటకి వెళ్ళేటప్పుడు మర్చిపోవడమూ అతనికి మామూలే. అలా అనుకుంటూ ఉండగానే మరొక రెండుగంటలు గడిచిపోయాయి, దాంతో ఆవిడకి కొంచం కంగారు మొదలయింది. ఒంటిగంట కావస్తోంది టైము. రాజేశ్వరి పని ముగించుకుని బయలుదేరుతుండగా ..

హాల్లో ఫోన్ గణ గణా మోగింది. అసలే కంగారుగా ఉన్న శారదా అగర్వాల్ గబ గబ ఫోన్ ఎత్తింది. ఎవరో తెలుగులో మాట్లాడుతున్నారు, ఆవిడకేమీ అర్థం కాక, రాజేశ్వరిని పిలిచింది, ఎవరో చూడమని. రాజేశ్వరి వచ్చి ఫోన్ తీసుకుంది.అవతల పక్కన లైన్ చాలా గోలగోలగా ఉంది, పెద్దగా వినిపించడం లేదు. గట్టిగా మాట్లాడసాగింది రాజేశ్వరి. "యాక్సిడెంట్ అయింది ఆటో అతను తీసుకొచ్చారు ఇప్పుడే "ఇలా ..అవతలి పక్కన మాట్లాడుతున్న మాటలు పూర్తిగా విననేలేదు రాజేశ్వరి. ఒక్క ఉదుటున శారద దగ్గరకొచ్చి

"అమ్మా, ఆటో అతను, ఆక్సిడెంటు అంటున్నారు, మా ఆయన నడిపే ఆటోకేమన్నా అయిందేమోనని అనుమానంగా ఉంది, పోయి చూశేసి వస్తానమ్మా, నువ్వు తలుపేసుకుని జాగ్రత్తగా ఉండు, తాగుమోతు సచ్చినోడు, పొద్దున్నే తాగేసి నడుపుతున్నాడో ఏందో?" అనుకుంటూ పరిగెత్తడం మొదలు పెట్టింది.

"ఉండు రాజేశ్వరీ, డబ్బులొద్దూ, అతనికేదైనా అయితే హాస్పటల్ కి తీసుకెళ్ళాలి కదా "అంటూ తన దగ్గర పర్స్‌లో ఉన్న రెండువేలు ఆమె చేతిలో పెట్టింది. శారద

"నీదెంత మంచి మనసు తల్లీ, నా కాడ డబ్బే లేదు, నేనా విషయమే మర్సిపోయాను" అని ఆవిడ చేతిలోంచి డబ్బు తీసుకుని పరిగెత్తింది.

" రాజేశ్వరి భర్త కేమయిందో ?తన భర్త ఇంకా ఎందుకు రాలేదు? " ఇలా ఆలోచిస్తూ ఆవిడ సోఫాలోనే కునికిపాట్లు పడసాగింది.

గణ గణ మంటూ టెలిఫోన్, కాలింగ్ బెల్ రెండూ ఒకే సారి మోగడంతో ఉలిక్కి పడి లేచింది ఆవిడ. ముందేమి చెయ్యాలో తెలియక తలుపుతీసి ఒక్క పరుగున ఫోన్ దగ్గరకొచ్చి ఎత్తి "హలో", అంది నెమ్మదిగా. ఆవిడ బావగారు వాళ్ళ ఊరినించి.

మాట్లాడేది ఆయన అని తెలియాగానే అప్రయత్నంగానే పైట చెంగు తల మీద ఉందా లేదా అని సరి చూసుకుంది. - వాళ్ళ కుటుంబాల్లో ఉగ్గుపాలతో నేర్పే మర్యాద తాలుకు ప్రభావం అది.

ఆయనతో నేరుగా మాట్లాడిన సందర్భాలు వేళ్ళమీద లెక్క పెట్టవచ్చు, ఆయనే ఎదురుగా ఉండి మాట్లాడుతున్నంత కంగారుగా ఉందావిడకి.

" హా బోలియే! " అంటూ మాట్లాడసాగిన ఆవిడకి అతను చెప్పిన విషయం వినగానే మతిపోయింది.

"నిజంగా?" అని మాత్రం అనగలిగింది. వెంటనే ఫోన్ పెట్టేసి ఏం చెయ్యాలో తెలియనట్టు సాఫా పక్కనే కింద కూలబడింది.

అంతకుముందు తలుపు తీసుకుని వచ్చిన రాజేశ్వరి, "అమ్మా, మా ఆయనకేం కాలేదులే, బానే ఉన్నాడు, డూటీకి కూడా ఎల్లకుండా మంచం మీద పండిండు. ఉత్తినే నాకు" అని ఇంకా ఏదో చెప్పబోతూ, విపరీతమైన కంగారు, ఆదుర్దాపడుతున్న ఆవిడని చూసి " ఏమయిందమ్మా? ఒంట్లో మంచిగున్నదా? నేను పోయేటప్పుడు బాగానే ఉన్నావు గదా "అంది. కంగారుగా.

అప్పుడావిడ చెప్పింది అసలు విషయం. రైలు టిక్కట్లు కొనడానికని వెళ్ళిన ఆవిడ భర్తని వెనకనించి టెంపో గుద్దిందనీ, ఆయనను గవర్నమెంటు హాస్పటల్‌కి తీసుకెళ్ళారనీ, అక్కడకి వచ్చి చూడమన్నారని. ఆయన జేబులో ఉన్న కాగితాలమీద నెంబర్లు చూసి తమ ఊరికి చేశారని, బావగారు మరిదీ బయలుదేరి వీలయినంత తొందరగా వస్తున్నారని.

రాజేశ్వరి ఫ్రిజ్‌లోంచి ఒక గ్లాసుడు నీళ్ళు తెచ్చి ఇచ్చి, "అప్పుడొచ్చిన ఫోన్ కూడా అయ్య గురించే అయి ఉంటదమ్మా, నా మతి మండా, నేను పిచ్చిదానిలా ఏదేదో ఆలోసించి ఇంటికి పోయినా. దామ్మా పోయి సూసొద్దాం "అని ఆవిడ చెయ్యి పట్టుకుని లేవదీసింది. పక్కవాళ్ళనెవరినైనా అడగాలని కానీ, చెప్పాలని కానీ వాళ్ళిద్దరికీ తోచలేదు.

ఇంటి ఎదురుగానే అదే అంతస్థులో ఆగి ఉన్న లిఫ్ట్ ఎక్కి బయలుదేరారు. ఆటో ఎక్కి దాదాపు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న గవర్నమెంట్ హాస్పటల్‌కి. డయాబెటీస్ పేషెంటు అయిన శారదకి విపరీతమైన కంగారుగా ఉంది, భర్తని ఏ పరిస్థితిలో చూడవలసి వస్తుందో అని బెంగగా ఉంది. అంకిత్‌కి వెంటనే ఫోన్ చెయ్యమని మాత్రం చెప్పగలిగింది ఆవిడ బావగారితో. రాజేశ్వరి చెయ్యి గట్టిగా పట్టుకుని కూర్చుంది. కళ్ళు మూసుకుని కులదేవతని ప్రార్ధించసాగింది. ఆవిడ కళ్ళవెంట ధారాపాతంగా కారుతున్న నీళ్ళు. తమవాళ్ళెవరూ లేని ఈ కొత్త చోట ఏమిటీ ఆపద? అని చాలా కలతగా ఉందావిడకి.

"ఈ ఊరు అనవసరంగా వచ్చాము, వచ్చినా కొడుకు అమెరికా వెళ్ళిన వెంటనే తామిద్దరూ కోడలిని తీసుకుని తమ ఊరు వెళ్ళిపోవలసింది, అంత ఆస్థి ఉండగా తమ కోడలు ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం ఏమిటి? ఇంతలో ఈ యాక్సిడెంట్ ఏవిటో? ఎలా ఉందో అతనికి? "ఇలా రకరకాల ఆ లోచనలు ఆవిడ మనసులో..

ఇంతలో రాజేశ్వరి ఫోన్ మోగింది, కింద ఇంటావిడ. రెండవుతున్నా రాజేశ్వరి పనికి రాలేదమని అడగడానికి. విషయం కుప్తంగానైనా, స్పష్టంగా చెప్పింది రాజేశ్వరి.

"అయ్యో, అదేమిటి?ఒక్క మాట చెప్తే నేను కూడా వచ్చేదాన్ని కదా "అంది ఆవిడ, కాసేపు మాట్లాడి పెట్టేసింది రాజేశ్వరి.

వీళ్ళిద్దరూ హాస్పటల్‌కి వెళ్ళేసరికి మరొక పావుగంట పట్టింది. అక్కడున్నంత గందరగోళం శారద తన జీవితంలో ఎప్పుడూ చూడలేదు. ఎక్కడకెళ్ళాలో, ఎవరిని అడగాలో తెలియలేదు వాళ్ళకి. కనిపించిన వారిని అడుగుతూ మూడుసార్లు అటూ ఇటూ తిరిగారు. టెన్షన్‌కి గుండె దడ మొదలయింది శారదకి. ఇంతలో కనిపించాడు విశాల్. ఇందాకా రాజేశ్వరి మాట్లాడిన కిందింటావిడ కొడుకు.

"ఆంటీ? ఏమయింది? , అంకుల్ ఎక్కడున్నారో తెలిసిందా? "అని అడిగాడు ఆత్రంగా.

"బాబూ మీరిక్కడ? "రాజేశ్వరి అడిగింది.

"అమ్మ ఫోన్ చేసింది ఇప్పుడే, నా ఆఫీస్ పక్కనే, ఐదు నిమిషాలు కార్‌లో వెళితే "అన్నాడు.

అక్కడంతా చాలా హడావిడిగా, గజిబిజిగా ఉంది. విశాల్ రాకపోయి ఉంటే వాళ్ళిద్దరికీ ఏమీ తెలిసి ఉండేది కాదు. మిగిలిన రోజంతా తిరుగుతూనే ఉండేవారేమో

"యాక్సిడెంటు కేసులా? ఆ పక్కన అని ఒకతను చెక్క బల్ల ముందు కూర్చుని పెద్దగా అరిచాడు. " అతను చెప్పిన చోటకి వెళ్ళి, అక్కడ కూర్చున్న ఒకావిడని అడిగారు. "ఈరోజా, నిన్నా? ఎప్పుడయింది? " అందావిడ విసుగ్గా.

మొత్తానికి కనుక్కోగలిగారు. అక్కడ కనిపించిన దృశ్యం చూసి ఆవిడే కాదు, విశాల్ కూడా కదిలి పోయాడు. ప్రాణం ఉందో లేదో తెలియనంతగా ఉంది శశాంక్ అగర్వాల్‌ని చూస్తే. అంత రద్దీగా ఉండే జంక్షన్‌లో అతన్ని అంత బలంగా టెంపో గుద్దిందంటేనే విశాల్‌కి ఆశ్చర్యం వేసింది.

ముఖానికీ, శరీరానికీ కూడా బాగా దెబ్బలు తగిలి రక్తం కారుతోంది, మోకాలు దగ్గర ఎముక విరిగిపోయింది, స్పృహ లేని అతని శ్వాస చాలా భారంగా, అతి నెమ్మదిగా కదులుతోంది, తెల్లటి చొక్కా అంతా ఎర్రగా మారిపోయింది. గాయాలకి కట్టు మాట అటుంచితే కనీసం ఒక దుప్పటి కప్పే దిక్కు కూడా లేదు. అతన్నా స్థితిలో చూసి ఆవిడ స్పృహ తప్పి ఒక్క ఉదుటున కింద పడిపోయింది. ఆ శబ్దానికి పక్కనించి వచ్చింది నర్స్. ఆవిడ్ని ప్లాస్టిక్ కుర్చీలో కూర్చోబెట్టి ముఖాన నీళ్ళు చల్లింది, రెండు నిమిషాలకి కళ్ళు తెరిచిందావిడ. ఏం జరుగుతోందో తెలియనట్టుగా అయోమయంగా ఉండిపోయింది శారదా అగర్వాల్. ఏడుపు కూడా రావడం లేదు ఆవిడకి.

"రాజేశ్వరి ఆంటీని చూసుకో, ఇప్పుడే వస్తాను" అని గబ గబ పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ వెళ్ళాడు విశాల్. మరొక ఐదు నిమిషాల్లో చేతిలో కొబ్బరి బొండంతో వచ్చి, రాజేశ్వరికిచ్చి " ఆంటీకి తాగించు, ఈ లోపున నేను మిగతా విషయం కనుక్కుంటాను" అని మళ్ళీ వెళ్ళాడు.

వరసగా ఫోనులు మాట్లాడుతూనే ఉన్నాడు, పెద్ద డాక్టర్ వచ్చేదాకా. డాక్టర్ వచ్చాకా ఆయనతోటీ మాట్లాడాడు.

అప్పుడు వచ్చారు రెండు కార్లలో అతని తల్లీ, మరొక ఆరుగురుడవాళ్ళు. వాళ్ళంతా అపార్ట్‌మెంట్‌లోని వారే. వారివెనకే మరొక కార్‌లో కొంతమంది మగవారు. ఇద్దరు గబగబా వెళ్ళి పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ రాయడం వగైరా కార్యక్రమాలు చూసుకుని వచ్చారు.

ఇంతలో మిగతావారు పేషెంట్‌ని దగ్గరలోని పెద్ద ప్రైవేట్ హాస్పటల్‌కి తీసుకెళ్ళారు. ట్రీట్‌మెంట్ మొదలయ్యింది అతనికీ, ఈ కంగారుకీ, ఆందోళనకీ అస్తవ్యస్తమైన ఆవిడ సుగర్‌ని కంట్రోల్ అవడానికి ఆవిడకి కూడా చిన్నగా చికిత్స చేశారు.

"ఆయన పరిస్థితి బొత్తిగా ఏమీ బావులేదు, కనీసం నలభై ఎనిమిది గంటలు గడిస్తే కానీ ఏమీ చెప్పలేము" అన్నారు. "అక్కడ ఉండి ఎవరూ చేసేదేమీ లేదు, ఇంటికి వెళ్ళిపోమన్నారు ఆవిడని తీసుకుని. తాము పర్యవేక్షిస్తాము కనక, ఆవిడ రోగ్యం కూడా అంతంత మాత్రం కనక ఆవిడ ఇక్కడ ఉండకపోవడమే మంచిది "అని వారు గట్టిగా చెప్పడంతో అందరూ ఇంటికి వచ్చేశారు.

రాజేశ్వరి, కింద ఇంటి ఆవిడ విజయా, ఎదురింటి కొత్త దంపతులు మోనికా, వరుణ్ అందరూ దాదాపు రాత్రంతా ఆవిడ దగ్గరే ఉన్నారు. అప్పటికావిడకి పరిస్థితి కొంత మెరుగయ్యింది. ఆవిడ బావగారు, మరిదీ వాళ్ళ ఊరునించి జైపూర్ వరకూ కారులో వచ్చి, జైపూర్ నించీ విమానం ఎక్కి హైదరాబాద్ చేరేసరికి తెల్లవారుఝాము మూడున్నరయింది.

నలభై ఎనిమిది గంటలన్నది నాలుగు రోజులయింది శశాంక్ అగర్వాల్ కోలుకొని కళ్ళు విప్పి చూడడానికి. ఆరో రోజున ఆయనను వార్డ్ కి మార్చారు. ఆయనకి యాక్సిడెంట్ అయిన మూడో రోజున వచ్చాడు వాళ్ళ అబ్బాయి అమెరికానించి. వరుణ్, విశాల్, విశాల్ తల్లితండ్రులు ఈ నాలుగు రోజులూ అతనితోనే ఉన్నారు, అతనికీ పెద్దనాన్న, బాబాయ్‌లకి ప్రతీ విషయంలోనూ సలహాలిస్తూ, కావలిసిన సహాయం చేస్తూ. రెండు వారాల తర్వాత ఆయనను ఇంటికి తీసుకొచ్చారు. నడుముకీ,ఛాతీకి పెద్ద బేండేజ్‌లూ, కాళ్ళకి సున్నపు కట్టూ. చాలా బలహీనంగా ఉన్నారు ఆయన. ఇంట్లో మంచమ్మీద పడుకోబెట్టారు. ఆ రోజు సాయంత్రం నించీ అపార్టమెంట్‌లోవాళ్ళందరూ ఒకరొకరుగా వచ్చి చూడడం మొదలు పెట్టారు.

ఆ రోజుకు వచ్చినవాళ్ళందరూ వెళ్ళాకా, బత్తాయిపళ్ళ రసం తీసి ఆయనకి ఇస్తూ అందావిడ.

"నొప్పి ఎలా ఉంది? "అని.

ఇప్పుడే కదల్చకూడదన్నారు కనక మళ్ళీ నాలుగురోజుల్లో వచ్చి అప్పుడు వీలైతే ఆయనని ఊరికి తీసుకుని వెళ్ళిపోదాం అని, బావగారు వాళ్ళు సాయంత్రమే వెళ్ళారు. ఆ విషయమేదో తేలాకా తను మళ్ళీ వెళ్ళి పని ముగించుకుని రావాలని అంకిత్ అనుకున్నాడు.

"మనం బాబు వచ్చేవరకూ ఇక్కడే ఉందాం" అందావిడ హఠాత్తుగా.

ఆయన ఇంకా పెద్దగా మాట్లాడలేకపోతున్నారు, చిన్నగా లోగొంతుకతో ఎప్పుడైనా బాగా అవసరం వస్తేనే మాట్లాడమన్నారు డాక్టర్.

ఆశ్చర్యంగా చూస్తూ నవ్వాడు ఆయన.

"ఆశ్చర్యంగా ఉంది కదూ, నేను ఇలా అంటూ ఉంటే, ఎందుకన్నానో తెలుసా? ఇది పెద్ద ఊరు కనక మీకు వెంటనే వైద్యం అంది ఇంత తొందరగా ఇంటికి రాగలిగారు, అదే మన ఊరిలో అయితే మీకు తగిలిన దెబ్బలకి జైపూరో, ఢిల్లీయో తీసుకెళ్ళవలసి వచ్చేది, అప్పటికెంత టైము పట్టేదో ఏమో.

రెండోది ముఖ్యమైనదీ ఏమిటో చెప్పనా ఇన్నాళ్ళూ నేను ఇక్కడ లేదనుకున్నది ఉందని తెలియడం. మనుషులూ, బంధాలూ, అవి నాకు ఇప్పుడు అద్దం మీద ఆవగింజంత స్పష్టంగా కనిపిస్తున్నాయి, అందుకే నాకిప్పుడు భయం లేదు, బోర్ అంతకంటే లేదు.

కొన్ని సంఘటనలు కొన్ని కొత్త విషయాలని తెలుపుతాయి అనిపించింది మొన్న మీకుజరిగిన యాక్సిడెంట్ తర్వాత. ఈ మహానగరంలో అందరూ చాలా బిజీగా ఉంటారు, ఎవరి పనుల్లో వాళ్ళు ఎప్పుడూ సతమవుతూ, ఉన్న ఇరవై నాలుగు గంటలనీ ఎలా సర్దుకోవాలా ?అని తాపత్రయంలో ఉంటారు అనుకునేదాన్ని మొన్నటివరకూ. మరీ ఒక అరగంట మనింటికొచ్చి కూర్చోలేరా?

మాట్లాడలేరా ? అనిపించేది నాకిన్నాళ్ళు. ఇక్కడి భాష నాకు రాకపోవడంతో నా వయసు వారితో కూడా నేను కలిసి మెలిసే అవకాశం కూడా పెద్దగా రాలేదు. కానీ అది అవేవీ సమస్యలే కాలేదు మనకి అవసరం వచ్చినప్పుడు.

మీకు దెబ్బ తగిలింది అని తెలియగానే నాకు ఎవరితోనైనా చెప్పాలని కానీ, తోడు తీసుకెళ్ళాలని కానీ తోచలేదు, ఎవరూ చెప్పకుండానే సంగతి తెలియగానే తమంతటతాముగా స్పందించి, నాకూ, మనవాళ్ళకి తోడుగా ఉన్నారు మన అపార్ట్‌మెంట్ వాళ్ళు. రెండు నెలల క్రితం పెళ్ళయిన వరుణ్, మోనికా రెండు క్షణాలు కూడా నన్ను వదలకుండా నాతోనే ఉన్నారు. 'ఆఫీస్ కి లేట్ అవుతుంది వెళ్ళి పడుకోండి అంటే కూడా పరవాలేదాంటీ, రేపు ఇంట్లోంచి పనిచేస్తాము' అన్నారు. కిందింటి విజయగారైతే ఇంటికి కూడా వెళ్ళలేదు, రాత్రంతా. ఇంక వాళ్ళ అబ్బాయి విశాల్ గురించి చెప్పనే అక్కర్లేదు, ఈ రెండు వారాల్లో నేను కేవలం నాలుగు రోజులు వంట చేసి ఉంటాను. అంతే. మిగతారోజులన్నీ ఎవరో ఒకరో ఏదో ఒకటి పంపడమో, పట్టుకురావడమో.

మన హవేలీల్లావీళ్ళ తలుపులు ఎప్పుడూ తెరిచి ఉండవు, అసలా మూసేసిన ఇళ్ళల్లో ఊపిరైనా ఆడుతుందా అని మిమ్మల్ని అడిగేదాన్ని గుర్తుందా? ఈ సంఘటన తర్వాత అర్థం అయింది. ఎప్పుడూ మూసిఉండేవి వాళ్ళ ఇళ్ళ తలుపులే కానీ మనసులు కావు ఎందుకంటే వాళ్ళ మనసులు మన హవేలీలంత పెద్దవి, విశాలమైనవి.

అంతే కాదు ఈ రెండు వారాల్లో నేను ఒక నాలుగయిదు వాక్యాలు తెలుగు కూడా నేర్చుకున్నాను, విజయగారితో మాట్లాడుతూ, అందుకని అబ్బాయి వచ్చేవరకూ కోడల్ని చూసుకోగలం, ఇక్కడే ఉండగలం కూడా. గెహనా అక్క ఇంటికి వెళుతుంటే అదే చెప్పాను నేను.. ఈ అపార్ట్‌మెంట్‌లో మూసుకుని ఉన్నవి కేవలం తలుపులే అక్కా, అని. అలా అంటూ ఉంటే ఆవిడ కళ్ళల్లోఇదీ అని తెలియని భావన, ఏదో కొత్త మెరుపు. మూసుకున్న తలుపుల వెనకున్న విశాలమైన మనసులు పంచిన స్నేహపు వెలుగుల కాంతేనేమో అది. "

విప్పారిన కళ్ళతో భార్యనే చూస్తున్నారు శశాంక్ అగర్వాల్.

●●●

Click here to share your comments on this story